తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం
31 జూలై 2026
పేజీలు : 08



# కన్నతండ్రే కాటేశాడు

## మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడి

- బాలిక స్నేహితురాలి ద్వారా బయటకు పక్కన దారుణం
- సిడబ్ల్యూసికి సమాచారం ఇచ్చిన ప్రిన్సిపల్
- వికారాబాద్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు నిందితుడు అరెస్టు రిమాండ్

మెయిన్‌లో

కంటికి రెప్పల కాపాడవలసిన తండ్రి వారి పాలిట కాలయముడయ్యాడు. కామంతో కళ్ళు మూసుకుపోయి అనేక సార్లు కన్నా కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దారుణ సంఘటన వికారాబాద్ జిల్లా రాజీవ్ గృహకల్పన జరిగింది. వికారాబాద్ సిఐ రఘు కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ గృహకల్ప లో నివాసముంటున్న ఒక మైనర్ బాలికపై కన్న తండ్రి జగన్నాథం(44) అనేకసార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలియజేశారు. ఈనెల 27వ తేదీన సిడబ్ల్యుసి సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలియజేశారు.

వికారాబాద్ జిల్లా బ్యూరో, జులై 30 (జనం సాక్షి)

# కదిలిన ఆర్అండ్‌బీ అధికారులు

### అలుగును పూడ్చేందుకు సిద్ధమైన గ్రామస్తులను ఆపిన అధికారులు

- పనులు మేమే చేస్తాం.మీరు వద్దు అంటూ భరోసా.
- నాలుగు నెలలుగా ముందుకు సాగని హైలెవెల్ బ్రిడ్జి పనులు.
- వర్షాలతో మళ్లీ రాకపోకలకు అంతరాయం.

2





- గైర్హాజరైన శాఖల అధికారుల తీరుపై మండిపాటు
- రోడ్లు, తాగునీరు, నాలాల ఆక్రమణల సమస్యల వెల్లువ
- ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు
- రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచన

## సమీక్షకు అధికారులు డుమ్మా.. సర్పంచుల ఆగ్రహం

2

- దండుమైలారంలో ఘటన.. పోలీసులకు భూ యజమాని ఫిర్యాదు
- వ్యవసాయ పనులు అడ్డుకున్న గుర్తుతెలియని వ్యక్తులు
- ట్రాక్టర్లు, పరికరాలు తొలగించాలని హెచ్చరికలు
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు

## పొలంలోకి చొరబడి కూలీలకు బెదిరింపులు

2

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### పిఏసి చైర్మన్ అరికెపూడి

2



# దళితుడిపై కేసు..

## ఎస్ఐ సస్పెన్షన్‌కు డిమాండ్

- భూమి ఆక్రమణకు సహకరించారంటూ చెన్‌గోముల్ ఎస్ఐపై ఆరోపణలు
- బాధితుడిపైనే కేసు నమోదు చేయడాన్ని ఖండించిన ప్రజాసంఘాలు
- అంబేద్కర్ విగ్రహం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన
- నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్



లోపలి పేజీలో

# జనంసాక్షి కథనంతో కదిలిన ఆర్అండ్‌బీ అధికారులు

**ధారూర్ జూలై 30(జనంసాక్షి)**
జనం సాక్షి కథనానికి స్పందించిన రహదారులు, భవనాల (ఆర్అండ్‌బీ) శాఖ అధికారులు స్పందించారు.వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం నాగసముందర్,కోట్‌పల్లి అలుగు వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అలుగు దాటడం కష్టంగా మారడంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా ఇసుక,మట్టి, రాళ్లతో పూడ్చి రాకపోకలు పునరుద్ధరించాలని నిర్ణయించుకున్నారు. అయితే అధికారులు అక్కడికి చేరుకుని,"పనులు మేమే చేపడతాం. మీరు చేయొద్దు"అంటూ గ్రామస్తులను నిలువరించి, తాత్కాలిక మరమ్మతులు త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. 2016లో కురిసిన భారీ వర్షాలకు కోట్‌పల్లి అలుగు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో అప్పటి వికారాబాద్ కలెక్టర్ నిఖిల రూ.50 లక్షలు మంజూరు చేయగా, ఆ నిధులతో తాత్కాలిక వంతెనతో పాటు సీసీ రోడ్డు నిర్మించారు.అయితే గత ఏడాది భారీ వరదల ఉధృతికి ఆ సీసీ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోగా, ఇరువైపుల రక్షణ గోడలు మాత్రమే మిగిలాయి.ప్రభుత్వం నుంచి శాశ్వత పరిష్కారం లేకపోవడంతో గత ఏడాది నాగసముందర్ గ్రామస్తులే స్వచ్ఛందంగా ఇసుక,మట్టి,రాళ్లతో అలుగును పూడ్చి తాత్కాలికంగా రాకపోకలు కొనసాగించారు. అయినప్పటికీ శాశ్వత పరిష్కారం కోసం పలుమార్లు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.గ్రామస్తుల విజ్ఞప్తికి స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవ తీసుకుని తెలంగాణ ప్రభుత్వం రహదారులు-భవనాల శాఖ ఆధ్వర్యంలో ధారూర్--కోట్‌పల్లి రహదారిపై నాగసముందర్ గ్రామం వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.27.50 కోట్ల అంచనా వ్యయంతో నిధులు మంజూరు చేయించారు.2026 మార్చి 31న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు.అయితే నాలుగు నెలలు గడిచినా మట్టి నమూనాల సేకరణ మినహా నిర్మాణ పనులు ముందుకు సాగలేదు.ఇదే సమయంలో మళ్లీ వర్షాకాలం రావడంతో గత మూడు రోజులుగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.జనం సాక్షి కథనం వెలువడిన అనంతరం అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అయితే తాత్కాలిక మరమ్మతులతో పాటు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని వివిధ గ్రామల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గురువారం నాడు గ్రామానికీ చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ లాలు హామ్మద్,శ్రీనివాస్,అలుగు పై మా సొంతం డబ్బులతో బగు చేస్తామని ముందుకు రావడంతో గ్రామ ప్రజలు వారిని అభినందించారు.


అలుగుపై రోడ్డు ఇలా.? ప్రయాణం ఎలా.?
- సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి
- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్ నవీన్ కుమార్

జనంసాక్షి

# 24వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం

**తాండూరు జులై 30(జనంసాక్షి) :**
తాండూరు మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ బాలకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి చేతుల మీదుగా 24వ వార్డులో నూతన బోర్‌వెల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని తెలిపారు. వార్డు అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.
కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,ఇతర వార్డు కౌన్సిలర్లు, వార్డు నాయకులు, కాలనీవాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బోర్‌వెల్ విజయవంతంగా పనిచేసి ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆకాంక్షించారు.



# దళితుడిపై కేసు.. ఎస్ఐ సస్పెన్షన్‌కు డిమాండ్

**బొంరాస్‌పేట, జూలై 30 (జనంసాక్షి):** దళిత రైతు భూమి ఆక్రమణకు సహకరిస్తూ బాధితుడిపైనే అక్రమ కేసు నమోదు చేసిన చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య, హక్కుల పోరాట సంఘం జిల్లా కార్యదర్శి డి. నర్సింలు మాట్లాడుతూ.. పూడూరు మండలం సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన దళిత రైతు జైదుపల్లి నర్సిములు భూమిని ఏసీఈ టైర్స్ కంపెనీ యాజమాన్యం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సర్వే నంబర్ 120లో బాధితుడికి చెందిన భూమిలో సుమారు 30 గుంటలను ప్రీకాస్ట్ పలకలు వేసి ఆక్రమించారని తెలిపారు.
ఈ విషయమై బాధితుడు పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేయకుండా, బాధితుడిపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం పోలీసుల పక్షపాత ధోరణికి నిదర్శనమని విమర్శించారు. భూమి ఆక్రమణను అడ్డుకోవాల్సిన పోలీసులు ఆక్రమణదారులకు రక్షణ కల్పించడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు.
దళితుల భూ హక్కులను పరిరక్షించాల్సిన అధికారులే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి, ఆయన పాత్రపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితుడిపై నమోదు చేసిన కేసును రద్దు చేసి, ఆక్రమిత భూమిని వెంటనే ఖాళీ చేయించి జైదుపల్లి నర్సిములుకు న్యాయం చేయాలని కోరారు. డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే జిల్లావ్యాప్తంగా దళిత, కార్మిక, రైతు, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రమేష్, మొగులయ్య, రాములు, ఎల్లప్ప, వెంకటయ్య, నరేష్, ప్రవీణ్, రాంచేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పొలంలోకి చొరబడి కూలీలకు బెదిరింపులు

**రంగారెడ్డి, జూలై 30 (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలో వ్యవసాయ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి సాగు పనులు చేస్తున్న కూలీలను బెదిరించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ వర్త్య చందర్ సింగ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. దండుమైలారం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త తాడూరి జనార్దన్‌రెడ్డి (85)కు సర్వే నంబర్ 441లో వ్యవసాయ భూమి ఉంది. బుధవారం సాయంత్రం కూలీలు నాగలితో పొలాన్ని దున్నుతుండగా కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు గుంపుగా అక్కడికి చేరుకుని పనులు నిలిపివేయాలని హెచ్చరించారు. కూలీలను బెదిరిస్తూ ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని ఒత్తిడి చేశారు. దుండగుల బెదిరింపులతో భయాందోళనకు గురైన కూలీలు పనులు నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న భూ యజమాని జనార్దన్‌రెడ్డి ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించి, విత్తనాల సీజన్ నేపథ్యంలో సాగు పనులకు ఆటంకం కలగకుండా రక్షణ కల్పించాలని, అక్రమంగా చొరబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 329(3) (అక్రమ ప్రవేశం), 324(4) (ఆస్తి నష్టం), 351(2) (నేరపూరిత బెదిరింపు), 3(5) కింద క్రైమ్ నంబర్ 523/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి... పిఏసి చైర్మన్ అరికెపూడి

**శేరిలింగంపల్లి, జులై 30 (జనంసాక్షి) :** మరి కొన్ని రోజులు భారీవర్షాల నేపథ్యంలో శేరిలింగంపల్లిలోని ఎన్డిఆర్ఎఫ్, హైడ్రా, సిఎంసి తదితర అన్ని విభాగాలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాబద్ధల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ క్రమంలో వరద పరిస్థితులు, ముందస్తు ఏర్పాట్లు మరియు సహాయక చర్యలపై గురువారం మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, శేరిలింగంపల్లి ఉప కమిషనర్ ఇస్లావత్ సేవ్యా తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం, హైడ్రా, పోలీస్, ట్రాఫిక్, ఎన్డిఆర్ఎఫ్, జలమండలి తదితర సంబంధిత అన్నిశాఖల అధికారులనుకూడా భాగస్వాములను చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ గత రెండుమూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి శేరిలింగంపల్లి లోతట్టు ప్రాంతాలని పూర్తిగా జలమయం కావడంతోపాటు ప్రధాన రహదారులన్నీ వర్షపు నీటితో నిండిపోవడం జరిగిందన్నారు. తద్వారా ప్రయాణికులు, శేరిలింగంపల్లి వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుండడంతో పాటు దైనందిన జీవితం అస్తవ్యస్తంగా మారిందన్నారు. దీనికి తోడు మంగళవారం సాయంత్రం వైశాలి నగర్ పరిధిలోని రైల్వే అండర్ పాస్ వద్ద వరద నీటిలో కొట్టుకొని పోయిన బాలయ్య ఉదంతాన్ని గుర్తుచేస్తూ ఒక్కసారిగా వరదలు రైల్వే అండర్ పాస్ వద్ద వరదల సమయంలో మ్యాన్‌హోల్‌లో పడి దుర్మరణం చెందడం దురదృష్టకరమన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాలను సురక్షితంగా మార్చాలని, అన్ని శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకొని అంతే బాధ్యతాయుతంగా పనిచేయాలని సంబంధిత అధికారులను కోరారు.

# సమీక్షకు అధికారులు డుమ్మా.. సర్పంచుల ఆగ్రహం

- గైర్హాజరైన శాఖల అధికారుల తీరుపై మండిపాటు
- రోడ్లు, తాగునీరు, నాలాల ఆక్రమణల సమస్యల వెల్లువ
- ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు
- రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచన



**శంకర్‌పల్లి, జూలై 30 (జనంసాక్షి):** మండల స్థాయి సమీక్ష సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సమావేశాలకు హాజరుకాకపోతే గ్రామాల సమస్యలను ఎవరికి వివరించాలని ప్రశ్నించారు. మండల ప్రత్యేక అధికారి సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, వ్యవసాయ సమస్యలపై విస్తృతంగా చర్చించారు.
మోకిల, కొండకల్ గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నాలాలను ఆక్రమించి విల్లాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారని, పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదని మోకిల సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్ ఆరోపించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇరిగేషన్‌తో పాటు ఎక్సైజ్, అటవీ, గృహనిర్మాణ శాఖల అధికారులు కూడా గైర్హాజరు కావడంపై సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్వేద-అంతప్పగూడ-తంగడపల్లి రహదారికి మూడేళ్ల క్రితమే నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదని అంతప్పగూడ సర్పంచ్ బీరయ్య ప్రశ్నించారు. లక్ష్మారెడ్డిగూడెం, కొండకల్-శేరిగూడ రహదారులు గుంతలమయంగా మారాయని ఆయా గ్రామాల సర్పంచులు తెలిపారు. పిల్లిగుండ్లలో డంపింగ్ యార్డు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పర్వేదలో జనాభాకు సరిపడా తాగునీటి సరఫరా లేదని సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కొండకల్, కొండకల్ తండా, శేరిగూడ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదని ఫిర్యాదు చేయగా, మోకిలలో సంపు నిర్మాణం పూర్తి చేసి త్వరలోనే నీటి సరఫరా ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.
మండలంలో సమగ్ర ఓటరు జాబితా సవరణ పనులు 81 శాతం పూర్తయ్యాయని, మిగిలిన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ సురేందర్ సూచించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా భూగర్భ జలాల పెంపునకు మ్యాజిక్ సోక్‌పిట్లు, పర్కొలేషన్ ట్యాంకులు నిర్మించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని, రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారి చైతన్య సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, మోకిల సొసైటీ చైర్మన్ గోపాల్, మండల పంచాయతీ అధికారి గిరిరాజ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# రెండున్నర రోజులుగా ఆచూకీ లభించని బాలయ్య మృతదేహం

**భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలు మరింత ముమ్మరం**

**నాలాపై కప్పును తొలగించి కెమెరాలను పంపించిమరీ**

**మృతదేహం కోసం అన్వేషిస్తున్న సిబ్బంది**



**శేరిలింగంపల్లి, జులై 30 (జనంసాక్షి)** : మంగళవారం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షాలకు శేరిలింగంపల్లి నియోజకవర్గం వైశాలి నగర్ వద్ద డ్రైనేజీలో కొట్టుకుపోయిన బాలయ్య మృతదేహాన్ని వెలికి తీసేందుకు అటు సిఎంసి, ఇటు హైడ్రా, మరోవైపు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. బాలయ్య మృతదేహం రెండున్నర రోజులుగా ఎక్కడ తట్టుకొని పోయిందో అర్థంకాక ఓవైపు అధికారులు, మరోవైపు సిబ్బంది అవిశ్రాంతంగా గాలింపును కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ, సిఎంసి ఉన్నతాధికారులు వైశాలి నగర్ ప్రాంతం నుండి మృతదేహం కోసం అన్వేషిస్తూనే పలుచోట్ల నాలా పైకప్పును పగులగొట్టి అందులోకి కెమెరాలను పంపించి చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు మృతదేహం ఎక్కడైనా తట్టుకొని ఉంటే నీటిలో కొట్టుకొస్తుంది అనే ఆశతో రెండున్నర రోజులుగా సిబ్బంది కంటిమీద కునుకు లేకుండా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఓవైపు హైడ్రా, ఎన్డిఆర్ఎఫ్ బృందాలు తమ వంతు గాలింపును కొనసాగిస్తుండగా శేరిలింగంపల్లి జోన్ కమిషనర్ నారాయణ్ అమిత్ సైతం తమ బృందాలను రంగంలోకి దించి కొనసాగింపును మరింత వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించడం జరిగింది. ఈ క్రమంలో నాలాలో కొట్టుకుపోయిన బాలయ్య ఇంటివద్ద తీవ్ర విషాదఛాయలు అలుముకోవడంతోపాటు రోదనలు మిన్నంటడంతో అధికారులపై మరింత ఒత్తిడి పెరుగుతుంది. ఏ క్షణమైనా బాలయ్య మృతదేహాన్ని కనుగొని వారి బంధువులకు ఉపయోగిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# ద్విచక్ర వాహనాల దొంగలను పట్టుకున్న నాచారం పోలీసులు




**జనం సాక్షి /నాచారం:** ద్విచక్ర వాహనాల దొంగతనం చేసిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జీఎస్టీ కాలనీలో 24వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఒక ఇంటి ముందు పార్కు చేసిన ఏపీ 29 ఏ హెచ్ 8237 నెంబర్ గల వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు బాధితుడు ఆగిండ్ల సుధాకర్ ఫిర్యాదు ఇచ్చినట్టు నాచారం పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టడంలో భాగంగా 29వ తేదీ సాయంత్రం నాచారం భవాని నగర్ ప్రాంతంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను పట్టుకొని విచారించగా వారి వివరాలు 1. ఆరోళ్ల భరత్ తండ్రి ఆరోళ్ల మల్లేష్ వయసు (25 )సంవత్సరాలు, నివాసం నాగార్జున నగర్ తార్నాక. 2. సిరిమిళ్ళ అఖిల్ ,తండ్రి సిరిమిళ్ళ వెంకన్న వయస్సు( 21 )సంవత్సరాలు నివాసం పార్వతి అపార్ట్మెంట్స్ భవాని నగర్ నాచారం. వారిని చాకచక్యంగా పట్టుకొని విచారించగా వారే ఈ దొంగతనానికి పాల్పడినట్టు నేరం అంగీకరించారని నాచారం పోలీసులు తెలిపారు వారి వద్ద నుండి దొంగిలింపబడ్డ ఏపీ 29 ఏ హెచ్ 8237 గల స్ప్లెండర్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అనంతరం వారిని రిమాండ్ కు తరలించినట్టు నాచారం ఇన్స్పెక్టర్ కే ధనుంజయ్ తెలిపారు. దొంగతనం చేసి తప్పించుకుని తిరుగుతున్న వారిని చాకచక్యంగా పట్టుకున్న వారు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ బి మాన్సింగ్ పర్యవేక్షణలో జరిగిందని ఆచారం పోలీస్ స్టేషన్ క్రైమ్ అండ్ సిబ్బందిని ఇన్స్పెక్టర్ అభినందించారు .

# ఉప్పల్ అభివృద్ధికి రూ.76.46 కోట్ల వరం

**పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**ప్రజా పాలన అంటేనే అభివృద్ధికి చిరునామా.. గత ప్రభుత్వం అప్పులు చేస్తే.. మేం అభివృద్ధి చేస్తున్నాం**

**కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా రాష్ట్రంలో అభివృద్ధి ఆగదు**



**ఉప్పల్, జూలై 30 ( జనం సాక్షి ) :** ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో భారీ అప్పులు మిగిల్చిందని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ, మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల పరిధిలో రూ.76.46 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి రామంతపూర్‌లో భజరంగ్ వ్యాయామశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, ఉప్పల్ భాగయత్‌లో వర్షపు నీటి కాలువలు, సీసీ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, బహుళ క్రీడా వేదిక, బస్‌స్టాప్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. బోడ్రాయ్--చిల్కానగర్ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు, చెర్లపల్లిలో ప్రధాన వర్షపు నీటి డ్రైనేజీ, రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పట్టణ మౌలిక వసతులు బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, కీసర ఆర్డీవో రాధికా గుప్తా, ఎంఎంసీ చీఫ్ ఇంజనీర్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ప్రజాప్రతినిధులు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# నీట్ ఘటనపై అమిత్ షా బర్తరఫ్‌కు డిమాండ్

**ఎల్బీనగర్ జులై 30 (జనం సాక్షి) :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యను ఖండిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి పిలుపు మేరకు, ఎల్‌బీ నగర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో మాల్ మైసమ్మ ఫ్లైఓవర్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సంజు గౌడ్తో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ విద్యార్థులపై అన్యాయం జరిగితే సహించేది లేదు: నారోజు కుమారస్వామి




**యాచారం, జూలై 30(జనం సాక్షి )** యాచారం మండలం మాల్‌లోని సెంట్ స్టీఫెన్స్ స్కూల్‌లో బీసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై జరుగుతున్న అన్యాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు నారోజు కుమారస్వామి హెచ్చరించారు. పాఠశాలలో నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ అధిక ధరలకు విక్రయిస్తూ, భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన వసతులు కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు భాగస్వాములుగా ఉండటంతో తాము చెప్పిందే చట్టం అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యార్థులు బోనాఫైడ్ సర్టిఫికెట్, పేరు సవరణల కోసం వెళ్తే సిబ్బంది అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, ఒక్కొక్కరి నుండి రూ.100 చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ వసూళ్లపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలలో మతపరమైన బోధనలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై డిఈఓ , ఎం ఈ ఓ నిష్పాక్షిక విచారణ జరిపించి వాస్తవాలను బయటపెట్టాలన్నారు. విద్యాసంస్థల్లో పారదర్శకత, చట్టబద్ధమైన పరిపాలన ఉండాలని, విద్యార్థుల హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా బీజేపీ తరఫున న్యాయపోరాటం చేస్తామని కుమారస్వామి స్పష్టం చేశారు.

# సిసి రోడ్డులను ప్రారంభించిన కోలన్ హనుమంత్ రెడ్డి



**నిజాంపేట్ జూలై 30 జనంసాక్షి :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం 277వ డివిజన్ మహాదేవపురంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కృషితో, సీఎంసీ స్పెషల్ ఫండ్ ద్వారా రూ.40 లక్షలు , రూ.68 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 277వ డివిజన్ పరిధిలోని మహాదేవపురం కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మహాదేవపురం కాలనీలోని ఏ డి ఎండి, ఎక్స్ బ్లాక్‌లతో పాటు ఫేజ్ 2 పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన రహదారుల నిర్మాణం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి కాలనీ అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మహాదేవపురం కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేసి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డికి కాలనీ వాసులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం 277వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, స్టేట్ మహిళా వైస్ ప్రెసిడెంట్ అంజలి యాదవ్, మహాదేవపురం కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కే. వెంకటరెడ్డి, ప్రసాద్, రాంచందర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టేందుకు చర్యలు

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొంకాని విజయ్ కుమార్

### బోడకొండలో పౌరహక్కుల అవగాహన సదస్సు



**రంగారెడ్డి, జులై 30 (జనంసాక్షి)**

ఎస్సీ ఎస్టీల పై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొంకాని విజయ్ కుమార్ అన్నారు. మంచాల మండల పరిధిలోని బోడకొండ గ్రామంలో పౌర హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు, వారి రక్షణకు ఉన్న చట్టాల గురించి ప్రతి ఒక్కరికి తెలివాల్సిన అవసరం ఉందన్నారు. ఆ చట్టాల గురించి ప్రజలకు వివరించారు. బాధితులకు చట్టం ద్వారా లభించే రక్షణ, న్యాయంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిరుపేద, వెనుకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో ఉదాహరణలతో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ వర్గాల ప్రజలు ఉన్నత చదువుల వైపు దృష్టి సారించాలని సూచించారు. తమ పిల్లలను ఆ లక్ష్యంతో చదివించాలన్నారు. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా స్వయం ఉపాధి రంగాల్లో కూడా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచిన ఆదర్శ మేధావుల గురించి తెలుసుకోవాలని సూచించారు. తమ పిల్లలు చెడు మార్గంలో పట్టకుండా సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేయాలని వివరించారు. రెవెన్యూ పంచాయతీ రాజ్ శాఖలతో పాటు పోలీసు శాఖ కూడా ఎస్సీ ఎస్టీలకు రక్షణగా ఉంటుందని తెలిపారు. దాడులు, హత్యలు, హత్యాచారాలు లోనైన క్రమంలో పోలీస్ శాఖ సంపూర్ణ సహకారాన్ని అందజేస్తుందని బాధితుల పక్షాన నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అందుకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టివ్ మానిటరింగ్ కమిటీ సంపూర్ణ సహకారాన్ని ఇస్తుందన్నారు. బాధితుల పక్షాన నిలబడతామని తెలిపారు. ఈ సదస్సులో మంచాల మండలం తహసిల్దార్ ప్రసాద్ రావు, సీఐ మధు , గ్రామ సర్పంచ్ చందర్ నాయక్, సీసీ సుజాత, ఐకేపీ బుక్ కీపర్ సునీత, ఆదా వర్కర్ సువర్ణ పాల్గొన్నారు.

## హస్తినాపురంలో 24 గంటల సర్ ప్రవాస్ అభియాన్ విజయవంతం

### హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్



**ఎల్బీనగర్ జులై 30 (జనం సాక్షి) :** రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు హస్తినాపురం డివిజన్‌లో నిర్వహించిన 24 గంటల సర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమం డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో ప్రవాస్ యోజన ఇన్‌చార్జ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్పాల్ గౌడ్ పాల్గొని శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, బి ఎల్ ఓలు, బి ఎల్ వో 2లు, బీఎల్‌ఏలతో సమావేశమై సర్ పురోగతిని సమీక్షించారు. వివిధ బూత్‌లను సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పనులపై సూచనలు చేశారు. అలాగే హనుమాన్ నగర్‌లో కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సంబంధిత బిఎల్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా, డివిజన్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గున్గల్ గ్రామంలో అభివృద్ధి పనుల పరిశీలించిన ఎంపీడీవో



**యాచారం, జులై 30(జనం సాక్షి )** మండల పరిధిలోని గున్గల్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను యాచారం ఎంపీడీవో రాధా రాణి గురువారం పరిశీలించారు. గ్రామంలో నిర్మిస్తున్న డ్వాక్రా భవనంతో పాటు అంగన్వాడీ సెంటర్-1 భవన నిర్మాణ పనులను వారు దగ్గరుండి చూశారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నిర్మాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాణి, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఉపసర్పంచ్ మచ్చ అనిల్ కుమార్, వార్డు సభ్యులు పంతంగి సుగుణమ్మ, పంతంగి మహేష్, కొంగర సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ విమానాశ్రయానికి ఏసీఐ వరల్డ్ లెవల్-5 అక్రెడిటేషన్

**శంషాబాద్,జూలై30(జనంసాక్షి) :** జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) ప్రపంచ ప్రఖ్యాత ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) వరల్డ్ ఎయిర్‌పోర్ట్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ అక్రెడిటేషన్ ప్రోగ్రామ్‌లో అత్యున్నత గుర్తింపైన లెవల్-5 అక్రెడిటేషన్‌ను సాధించింది. ఈ గుర్తింపుతో కస్టమర్ సేవలు, కార్యాచరణలో నాణ్యత, భాగస్వామ్య సహకారంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్న ప్రపంచంలోని ప్రముఖ విమానాశ్రయాల జాబితాలో హైదరాబాద్ విమానాశ్రయం స్థానం సంపాదించింది.

## గుంతల మయంగా యాచారం - కందుకూరు రహదారి

### నిత్యం తప్పని ప్రమాదాలు, ప్రయాణికుల అవస్థలు



**యాచారం, జూలై 30(జనం సాక్షి )**యాచారం నుండి కందుకూరు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం పూర్తిగా అధ్వానంగా తయారైంది. గత కొంతకాలంగా సరైన మరమ్మతులు లేకపోవడంతో రోడ్డంతా పెద్ద పెద్ద గుంతల మయంగా మారింది. కంకర తేలి, గుంతలు పూడకపోవడంతో ఈ దారిన ప్రయాణించాలంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలను తప్పించబోయి అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు సరిగ్గా లేకపోవడం, గుంతల లోతు తెలియకపోవడంతో ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోంది. వర్షం పడినప్పుడు ఈ గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయని, కాలినడకన వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు సైతం ఈ రోడ్డుపై వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లే రోగులు, గర్భిణీలు పడుతున్న నరకయాతన వర్ణనాతీతంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, కంటితుడుపు చర్యలు కాకుండా శాశ్వత ప్రాతిపదికన ఈ రహదారికి నిధులు మంజూరు చేసి, యుద్ధప్రాతిపదికన నూతన రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.



## హైదర్‌షాకోట్‌లో బోనాల ఉత్సవాలకు ఘన ఏర్పాట్లు

### బోనాల నిర్మాణ నూతన కమిటీ ఎన్నిక

**రాజేంద్రనగర్,జూలై30(జనంసాక్షి) :** ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో నిర్వహించే బోనాల పండుగ ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీర్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి తెలిపారు. 123వ డివిజన్ హైదర్‌షాకోట్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బోనాల పండుగ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొని ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం బోనాల ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి, చైర్మన్‌గా నర్సింగరావు, వైస్ చైర్మన్‌గా లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 9న బోనాల ఉత్సవం, ఆగస్టు 10 న ఫలహారం బండి ఊరేగింపును సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని పెద్దల సమక్షంలో నిర్ణయించారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలు, యువత, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని పూలపల్లి రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి : కోట్‌పల్లి ఎస్ఐ శైలజ



**కోట్‌పల్లి, జూలై 30 (జనంసాక్షి):** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్ఐ శైలజ విజ్ఞప్తి చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు ఉద్ధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు బయటకు రావద్దని, తల్లిదండ్రులు చిన్నారులను నీటి ప్రవాహాలు, చెరువులు, వాగుల వద్దకు వెళ్లనివ్వకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల సమీపానికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు చెరువులు, నదులు, వాగుల్లో చేపల వేటకు వెళ్లరాదని, ప్రాణాపాయానికి దారితీసే సాహసాలు చేయవద్దని ఎస్ఐ స్పష్టం చేశారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండి, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వర్షాల కారణంగా ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడేలా సహకరించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

## ప్రీమియం ల్యాప్‌టాప్‌లను విస్తరించిన డెల్



**ఖైరతాబాద్, జూలై 30 (జనం సాక్షి) :** డెల్ టెక్నాలజీస్ భారత దేశంలో ఎక్స్.పీ.ఎస్ 13, డెల్ 14ఎస్, డెల్ 16ఎస్, ఏలియన్‌వేర్ 15 ల్యాప్‌టా ప్‌లను విడుదల చేసినట్లు డెల్ టెక్నాలజీస్ గ్లోబల్ కన్స్యూమర్ అండ్ ఈ-కామర్స్ సీనియర్ వైస్ ప్రెసి డెంట్ అండ్ జనరల్ మేనేజర్ క్రిస్ కోగర్ గురువా రం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పే ర్కొన్నారు. ఆసియా పసిఫిక్, జపాన్ కన్స్యూమర్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ అండ్ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్ రిషి, ఇండియా కన్స్యూమర్ బిజినెస్ సీనియర్ డైరెక్టర్ అండ్ జనరల్ మేనేజర్ అనురాగ్ అరోరా లతో కలసి ఆయన మాట్లాడుతూ భారత దేశం కీలక మార్కెట్ అని, భారతీయ వినియోగదా రులకు ప్రపంచ స్థాయి టెక్నాలజీ అందిస్తామని తె లిపారు. డెల్ స్టోర్.కామ్, డెల్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్లు, 400 నగరాల రిటైల్ నెట్‌వర్క్ ద్వారా ఉత్పత్తుల ను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువస్తు న్నట్లు వెల్లడించారు.

# పెగాసిస్టమ్స్ మొట్టమొదటి 'నేషనల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్' ప్రారంభం

**హైదరాబాద్, జూలై 31 (జనంసాక్షి) :** కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్‌ను అందించే పెగాసిస్టమ్స్ తన ప్రతిష్టాత్మక ఈవెంట్ 'పెగాఇన్నోవేట్' వేదికగా మొట్టమొదటి 'నేషనల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. నేషనల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), స్మార్ట్‌బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సహకారంతో అందిస్తుంది. ఐదు వారాల వంద శాతం వర్చువల్ లెర్నింగ్ ప్రోగ్రామ్ ఇది. భవిష్యత్తు సాంకేతిక ప్రతిభను పెంపొందించడంలో భాగంగా పెగా పెట్టిన ఈ పెట్టుబడి.. ప్రస్తుతం ప్రపంచ సంస్థల పని తీరును మారుస్తున్న అత్యాధునిక సాంకేతికతలను భారతీయ విద్యార్థులు నేరుగా ప్రాక్టికల్ గా అనుభవపూర్వకంగా నేర్చుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. దీని ద్వారా విద్యార్థులు క్రింది అంశాలలో శిక్షణ పొందుతారు. జనరేటివ్ ఏఐ, పెగా బ్లూప్రింట్, ఏజెంటిక్ ఇంజనీరింగ్, వర్క్‌ఫ్లో ఆటోమేషన్, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్. ఈ ప్రోగ్రామ్‌లో పెగాకు చెందిన ప్రత్యేక మెంటార్లు విద్యార్థులతో కలిసి పని చేస్తూ ఎంటర్‌ప్రైజ్ ఽ వర్క్‌ఫ్లో ఆటోమేషన్, పెగా బ్లూప్రింట్ ద్వారా జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐలలోని నూతన పోకడలను పరిచయం చేస్తారు. పెగా సీనియర్ నాయకులు ఎంపిక చేసిన సెషన్లలో మార్కెట్‌లో కంపెనీకి ఉన్న ప్రత్యేక స్థానాన్ని వివరిస్తారు. పెగా ఇకోసిస్టమ్‌లో కెరీర్‌ను నిర్మించుకోవడం ద్వారా భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలకు విద్యార్థులు ఎలా సన్నద్ధం కావచ్చో మార్గదర్శనం చేస్తారు. పెగా నిర్వహించే ప్రతిష్టాత్మక యూనివర్సిటీ అకాడమిక్ ప్రోగ్రామ్ (యూఏపీ) కి నేషనల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ప్రాథమిక పునాదిగా పని చేస్తుంది. ఈ యూఏపీ ప్రోగ్రామ్ కూడా కొత్త వ్యూహం, నూతన సిలబస్‌తో ఆగస్టు 2026లో ప్రారంభం కానుంది. భారతీయ విద్యా సంస్థల నుంచి ప్రతిభను వెలికి తీసి, వారికి మెరుగైన భవిష్యత్తును అందించాలనే పెగా నిబద్ధతకు ఈ రెండు ప్రోగ్రామ్‌లు నిదర్శనంగా నిలుస్తాయి.

# బోనాలకు పలువురు హాజరు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** శ్రీశ్రీ శ్రీ నల్లపోచమ్మ దేవి, శ్రీ శ్రీ మహంకాళి దేవి మందిరం కమిటీ నటరాజ్ నగర్ సబ్జి మండి బోనాల మహోత్సవం సందర్భంగా అన్ని విభాగాలవారు హాజరయ్యారు. డీసీపీ జె రాఘవేంద్ర రెడ్డి, ఏసిపి పి తిరుపతి, ఎస్‌హెచ్‌ఓ కుల్సుంపుర సిఐ రాములు, ఎస్‌హెచ్‌ఓ టపాచపుత్ర బాలకృష్ణ, మాజీ కార్పొరేటర్ మండగిరి స్వామి, గంగపుత్ర సంఘం అధ్యక్షులు దోర్నల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి ఆనంద్ దేశి వేణుబాబు, ఉమ్మడి బోనాల కమిటీ అధ్యక్షులు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి అల్లే రామ్ కుమార్, వీరితోపాటు ఉమ్మడి బోనాల గౌరవ సలహాదారులు, కమిటీ సభ్యులు అందరూ పాల్గొన్నారు. జిహెచ్ఎంసి, వాటర్ వర్క్, ఎలక్ట్రిషన్స్, ఎండోమెంట్ వాళ్లతో పాటు వివిధ గవర్నమెంట్ అధికారులు కూడా ఉన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని విధాలుగా సహకారాలు అందించాలని పూజా కమిటీ సభ్యులు కోరారు.

# బస్సులోంచి వ్యక్తి అదృశ్యం



**అమీర్‌పేట్ (జనంసాక్షి) :** ఎర్రగడ్డ ప్రాంతంలో ఓ మానసిక, శారీరక వైకల్యం కలిగిన వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు క్రైమ్ నం. 463/2026 కింద వ్యక్తి అదృశ్యమైన కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన కాటి పెంటయ్య (49) తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం (జూలై 29) ఉదయం సుమారు 7 గంటలకు ఎర్రగడ్డ మానసిక వైద్యశాలకు చికిత్స కోసం బస్సులో వచ్చారు. ప్రయాణ సమయంలో పెంటయ్య బస్సు ముందు భాగంలో కూర్చోగా, కుటుంబ సభ్యులు వెనుక భాగంలో కూర్చున్నారు. ఎర్రగడ్డ బస్‌స్టాప్ వద్ద కుటుంబ సభ్యులు బస్సు దిగినప్పటికీ, పెంటయ్య బస్సులోనే ఉండిపోయాడు. అనంతరం ఆయన ఆచూకీ తెలియకుండా పోయింది. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెంటయ్య మానసిక, శారీరక వైకల్యం కలిగిన వ్యక్తి కావడంతో, ఆయన ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు, వార్తా మాధ్యమాలు సహకరించి ఆయనను గుర్తించేందుకు తోడ్పడాలని కోరారు.

## మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన ఒగ్గు బీరప్ప



**బొంరాస్‌పేట, జూలై 30 (జనం సాక్షి):** జాతీయ అంతర్జాతీయ వేదికల మీద ఒగ్గుడోలు ప్రదర్శన నిర్వహించి, గ్రామాలలో యువ ఒగ్గు కళాకారులకు శిక్షణ ఇచ్చి ఒగ్గుడోలు నైపుణ్యంలో మెలకువలు నేర్పడంలో మేటి ఆయనే ఒగ్గు బీరప్ప. మండల పరిధిలోని నాందార్ పూర్ గ్రామానికి చెందిన ఈయనకు శ్రీ మల్లికార్జున ఓ కళ సేవా సమితి గ్రామ నూతన అధ్యక్షుడిగా మరోసారి కళాకారుల బృందం అవకాశం కల్పించింది. తనపై నమ్మకం ఉంచి మరోసారి అవకాశం ఇచ్చిన ఒగ్గు కళాకారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పల్లవి మోడల్ స్కూల్‌లో ఘనంగా ముగిసిన దక్షిణ మండల సీబీఎస్ఈ బాలుర చెస్ పోటీలు



**బోడుప్పల్ జనంసాక్షి :** బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్ వేదికగా జూలై 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన దక్షిణ మండల సీబీఎస్ఈ బాలుర చెస్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలు గురువారం విజయవంతంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు ఆరు రౌండ్లుగా జరిగిన ఈ పోటీల్లో దేశంలోని 213 పాఠశాలల నుంచి 849 మంది క్రీడాకారులు తమ మేధో సామర్థ్యాన్ని ప్రదర్శించారు. అండర్-11 విభాగంలో 211 మంది, అండర్-14లో 485 మంది, అండర్-19లో 153 మంది విద్యార్థులు పాల్గొని హోరాహోరీగా పోటీపడ్డారు. ప్రతి రౌండ్‌లోనూ విద్యార్థులు వ్యూహాత్మక ఎత్తుగడలతో ఆకట్టుకున్నారు. ముగింపు కార్యక్రమానికి నేషనల్ చెస్ చైర్మన్ కె.ఎస్. ప్రసాద్, చెస్ జనరల్ సెక్రటరీ ఏ.జే. చంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్ సుశీల్ కుమార్, ప్రిన్సిపల్ తనూజ, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఆర్. చంద్రమౌళి పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అండర్--11 విభాగంలో వెల్లమాల్ విద్యాలయ (మంగడు, చెన్నై) తొలి స్థానం, వెల్లమాల్ అకాడమీ (నోలంబూర్, చెన్నై) ద్వితీయ స్థానం, వెల్లమాల్ విద్యాలయ(పరుతిపట్టు-అవడి, చెన్నై) తృతీయ స్థానం సాధించాయి. అండర్-14 విభాగంలో వెల్లమాల్ విద్యాలయ (మంగడు, చెన్నై) విజేతగా నిలవగా, వెల్లమాల్ విద్యాలయ (నంబాక్కం, చెన్నై) రెండో స్థానం, వెల్లమాల్ విద్యాలయ (పూనమల్లీ, చెన్నై) మూడో స్థానం కైవసం చేసుకున్నాయి. అండర్-19 విభాగంలో వెల్లమాల్ విద్యాలయ (పోరూర్, చెన్నై) ఛాంపియన్‌గా నిలవగా, బాల విద్యా మందిర్ సీనియర్ సెకండరీ స్కూల్ (అద్యార్, చెన్నై) ద్వితీయ స్థానం, కల్వి ఇంటెల్ పబ్లిక్ స్కూల్ (రాయపురం, మధురై) తృతీయ స్థానం దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, పాఠశాలలు, నిర్వహణ కమిటీల సభ్యులను ప్రత్యేకంగా సత్కరించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యాన్ని అతిథులు అభినందించారు.



# మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి అందుతున్న సురక్షిత మంచి నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలి




**బొంరాస్ పేట, జూలై 30(జనం సాక్షి):** మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి అందుతున్న సురక్షిత మంచినీటిని వృథా చేయకుండా ప్రజలు వినియోగించుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏర్పుమళ్ళ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హర్ ఘర్ జల్ జల్ అర్పాన్ దివాస్, జల్ జీవన్ మిషన్ తెలంగాణ ప్రభుత్వం ఆరోద్వర్యంలో చేపట్టిన జల మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు దగ్గర గ్రామ సర్పంచ్ బందేయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ తో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం నల్ల ద్వారా వస్తున్న సురక్షితమైన త్రాగునీటిని ప్రారంభించారు. గ్రామ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డబ్ల్యూఎస్ ల్యాబ్ టెక్నీషియన్ చైతన్య మిషన్ భగీరథ సురక్షితమైన త్రాగునీరు, బోరు నీళ్లు,ఆర్వో వాటర్ ప్లాంట్ లో దొరికే నీటిపై టెస్టింగ్ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్,వార్డు సభ్యులు ఈశ్వరయ్య, శ్రీనివాస్,ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు,మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

### మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్



**బొంరాస్ పేట, జూలై 30 (జనం సాక్షి):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏర్పుమళ్ళ గ్రామంలోని పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బందెయ్య, ఉప సర్పంచ్ తిరుపతయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి బూట్లు, తదితర సామాగ్రిని అందజేశారు.



## కర్ణాకర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**ఎల్బీనగర్ జులై 30 (జనం సాక్షి) :** తుమ్మలూరు మాజీ సర్పంచ్, రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మన్ మద్ది కర్ణాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా కర్మన్‌ఘాట్ ధ్యాన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. చికిత్సకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డికు గోపాల్ ముదిరాజ్, బత్తుల శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్లెల నరసింహారెడ్డి, ఎం. భాష, గోగు శేఖర్ రెడ్డి, రాజేష్ యాదవ్, వెంకట్ చారి, వెంకటేష్, భాస్కర్ రావు, కొండ యాదగిరి, ఉయ్యాల యాదయ్య గౌడ్, రామకృష్ణ, శ్రీనాథ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సదానందం, సీతారాం రెడ్డి పాల్గొన్నారు.

# రాంలీలా మైదానంను మరింత అభివృద్ధి చేస్తాం

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**నిజాంపేట్ జూలై 30 జనం సాక్షి :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 – సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ శ్రీ రాంలీలా మైదానంనూతన కమిటీ కార్యవర్గం సభ్యులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ ఆధ్వర్యంలో గురువారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి రామ్ లీలా మైదానంలో నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారుకు బిగించడంతో పాటు విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ నూతన కమిటీ అధ్యక్షులైన కొట్టే రవి, ప్రధాన కార్యదర్శి అయిన కొత్తకొండ రవిలను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలకు, పండుగలకు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న శ్రీ రామ్ లీలా మైదానములను అభివృద్ధి చేసేందుకు కమిటీ సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు ధారం సాయికుమార్, మాణిక్య రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మాసిరెడ్డి, శ్రీనివాస్, సెక్రటరీ లక్ష్మణ్, గోవిందప్ప, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు శ్రావణ్ కుమార్, వీరన్న, భాస్కర్ రెడ్డి, సభ్యులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితాలో ఓటు నమోదు చేసుకోవాలి

### మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి

**మొయినాబాద్, జూలై 30, జనంసాక్షి :** మండలంలో ప్రతి ఓటరు సమగ్ర సర్వేలో ఓటు నమోదు చేసుకునేందుకు కృషి చేయాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం కేతిరెడ్డిపల్లి గ్రామంలో యువకులు, పార్టీ నాయకులతో కలిసి సర్ బిఎల్వోల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లు ఇస్తున్న పారాలను పరిశీలించి తప్పులు లేకుండా చేయాలని బీఎల్ వోలకు తెలిపారు. అదే విధంగా గ్రామాలలో ప్రజలందరూ వచ్చే నెల 3 చివరి తేదీ అని సూచించారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన గడువుకు తమ ఓటు హక్కు తప్పనిసరిగా నమోదు చేసుకునేందుకు ఎన్యూమరేసన్ ఫారాలను త్వరగా పూర్తి చేసి అందించాలన్నారు. రెండు చోట్ల ఓటు నమోదు చేసుకోవడం తప్పు అని అన్నారు. రెండు ఓట్లు ఉంటే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో త్వరగా పూర్తి చేసేందుకు అందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల యువకులు, వివిధ పార్టీల నాయకులు, బీఎల్ వోలు పాల్గొన్నారు.



## ధారూర్‌లో ఐదు మొబైల్ ఫోన్ల రికవరీ

### బాధితులకు అప్పగించిన ఎస్ఐ రాఘవేందర్

**ధారూర్ జూలై 30(జనంసాక్షి) :** ధారూర్ మండల పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి గురువారం బాధితులకు అప్పగించారు. ఫోన్లు పొందిన వారిలో నస్కల్ గ్రామానికి చెందిన బైండ్ల గంగాధర్,హైదరాబాద్‌కు చెందిన బుడిగె కావ్య, ఔసుపల్లి గ్రామానికి చెందిన ఆర్.గోపాల్,దోర్నాల తండాకు చెందిన కే. రవీందర్,నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రీశైలం ఉన్నారు.ఈ సందర్భంగా ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ మాట్లాడుతూ,మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించి రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు.

## గచ్చిబౌలి సీఐ సైదులుకు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు



**రాజేంద్రనగర్,జూలై30(జనంసాక్షి) :** గచ్చిబౌలి సీఐగా బాధ్యతలు చేపట్టిన సైదులును గౌలిదొడ్డికి చెందిన కాంగ్రెస్ నాయకులు జై జయేందర్, పి. రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విధి నిర్వహణలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## మర్పల్లి ప్రధాన రహదారి బురదమయం.. ప్రజలకు నిత్యం నరకయాతన

### వాహనాల రాకపోకలతో పాదచారులపై బురద చిమ్ములు

**మర్పల్లి జూలై 30 (జనంసాక్షి)** మర్పల్లి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు నత్త నడక నడుస్తున్నాయి. గత నాలుగైదు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు పూర్తిగా బురదమయం మైన రోడ్లు ఆ బురదలో నుండి వాహనాలు వెళ్లినప్పుడు బాటసారులపై చిల్లుతున్నాయి. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతో గుంతల లోతు తెలియక ప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆందోళన గురవుతున్నారు. నిరంతరం రద్దీగా ఉండే రోడ్డుపై కాలి నడకన వెళ్లే వారిపై బురద చిల్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు మాయమైన రోడ్లపై సంబంధిత అధికారులు





కాంట్రాక్టర్లు, మట్టితో పూడ్చి లెవెల్ చేసి గుంతలు లేకుండా నీళ్లు నిలవకుండా చూడాలని, మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్‌నగర్, జూలై 30 (జనం సాక్షి) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆగస్టు 3వ తేదీతో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో, రాఘవేంద్ర కాలనీ కమ్యూనిటీ హాల్, సాయి నగర్ కమ్యూనిటీ హాల్‌లలో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, దరఖాస్తుల స్వీకరణ, పత్రాల పరిశీలన, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంకా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా అవసరమైన పత్రాలతో సమీప ఎస్ఐఆర్ కేంద్రాన్ని సందర్శించి తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, కాలనీవాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### సర్పంచ్ మూడవత్ సునీత రాజు



**కొడంగల్,జూలై 30(జనం సాక్షి ):** కొడంగల్ మండల పరిధిలోని పోషమ్మ తండ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మూడవత్ సునీత రాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని.నేడు నాటిన ప్రతి మొక్కను బతికించడం కూడా అంతే ముఖ్యం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఉపసర్పంచ్ శంకర్ నాయక్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో కైనెటిక్ ఈవీ కొత్త డీలర్‌షిప్ ప్రారంభం

**ఖైరతాబాద్, జూలై 30 (జనం సాక్షి):** కైనెటిక్ ఇం డియా ఎలక్ట్రిక్ వాహన విభాగమైన కైనెటిక్ వాట్స్ అండ్ వోల్ట్స్ లిమిటెడ్ ఖమ్మంలోని రోటరీ నగర్‌లో సాయిబాబా మోటార్స్ వద్ద కొత్త కైనెటిక్ ఈవీ డీల ర్‌షిప్‌ను ప్రారంభించినట్లు కైనెటిక్ వాట్స్ అండ్ వోల్ట్స్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అజింక్య ఫిరోదియా గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయిబాబా మోటార్స్ డీలర్ ప్రిన్సిపల్ నరేంద్ర తోకలపి ఆయన మాట్లా డుతూ ఈ విస్తరణతో తెలంగాణలో కంపెనీ రిటైల్ ఉనికిని మరింత బలోపేతం చేసినట్లు చెప్పారు. కొత్త డీలర్‌షిప్‌లో విక్రయాలు, సర్వీస్, స్పేర్ పార్ట్స్ కు సంబంధించిన సమగ్ర సౌకర్యాలు అందుబాటు లో ఉంటాయని తెలిపారు. ఖమ్మం, పరిసర ప్రాం తాల్లో విశ్వసనీయమైన, తక్కువ ఖర్చుతో కూడిన ఎలక్ట్రిక్ మొబిలిటీ పరిష్కారాలపై పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం వంటి అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఎలక్ట్రిక్ వాహనాల స్వీకరణకు విశేష అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ డీలర్‌షిప్ ద్వారా వినియోగ దారులకు నాణ్యమైన అమ్మకాల అనంతర సేవలు అందిస్తామని తెలిపారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై విమల



**బంట్వారం జూలై 30 (జనంసాక్షి) :** భారీ వర్షాల నేపథ్యంలో 12/ వర్షం కురిపిస్తున్న మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బంట్వారం ఎస్సై విమల విజ్ఞప్తి చేశారు. సురక్షితమైన భవనాల్లోనే ఉండాలని, వరద నీటితో నిండిన రహదారులు, వాగులను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ముఖ్యంగా రైతులు పొలాల వద్ద చెట్ల కింద నిలబడకూడదని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను తాకకుండా, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు సమాచారం ఇవ్వాలని, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.

## వృద్ధుల సంక్షేమానికి ఆస్టర్ ప్రైమ్ 'ప్రణామ్ ప్రివిలేజ్ కార్డు'

### అమీర్‌పేట్‌లో ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభం



**అమీర్‌పేట్ (జనంసాక్షి) :** వృద్ధులకు మెరుగైన ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అమీర్‌పేట్‌లోని ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ ప్రత్యేకంగా రూపొందించిన లిలి'ప్రణామ్ ప్రివిలేజ్ కార్డు'లిలిను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ ప్రవేశపెట్టిన ప్రణామ్ ప్రివిలేజ్ కార్డు ద్వారా సీనియర్ సిటిజన్లకు నాణ్యమైన వైద్య సేవలు, ప్రత్యేక రాయితీలు, ఆరోగ్య పరీక్షలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. హాస్పిటల్ ప్రతినిధులు మాట్లాడుతూ, వృద్ధుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్డును రూపొందించామని, కార్డు ద్వారా పలు వైద్య సేవలపై ప్రత్యేక ప్రయోజనాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు



## బోనాల ఉత్సవాలకు సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వానం

**రాజేంద్రనగర్, జూలై30(జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఆగస్టు 2న జరగనున్న ఆషాఢ మాస బోనాల మహోత్సవాలకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రా రెడ్డి, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డిలను బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆహ్వానాన్ని స్వీకరించిన వారు బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, మహోత్సవాలకు తప్పకుండా హాజరై విజయవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అక్కెం రాఘవేంద్ర యాదవ్, మైసిగండి క్రాంతి మహేందర్, శాంతిరాజ్ అఖిల్, నిఖిల్,చిరు,పవన్,అనిల్, చిన్న కున్ని, సోనీ తదితరులు పాల్గొన్నారు.



## ముర్షత్ దర్గాను దర్శించుకున్న కంజర్ల విజయలక్ష్మి యాదవ్

**తాండూరు జులై 30(జనంసాక్షి)** పట్టణంలోని ప్రసిద్ధ ముర్షత్ దర్గాను కంజర్ల విజయలక్ష్మి యాదవ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు దర్గా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి, పూలదండతో సత్కరించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, దేశంలో శాంతి, సామరస్యం వర్ధిల్లాలని మొక్కులు చెల్లించారు.ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరూ కలిసి అన్నదమ్ముల్లా ఉంటూ, మత సామరస్యాన్ని చాటినట్లు స్థానికులు అన్నారు.దర్గా సందర్శన అనంతరం కంజర్ల విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని మతాలను సమానంగా గౌరవించడమే మన సంస్కృతి అని, తాండూర్ లో ఉన్నటువంటి సామరస్య వాతావరణం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమం సజావుగా జరగడానికి దర్గా కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## గడ్డిఅన్నారంలో కృంగిన మ్యాన్‌హోల్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి



**ఎల్బీనగర్, జులై 30 (జనం సాక్షి) :** గడ్డిఅన్నారం డివిజన్‌లో కృంగిపోయిన మ్యాన్‌హోల్స్‌ను తక్షణమే పునరుద్ధరించి, తాగునీరు, మురుగునీటి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హెచ్ఎండబ్ల్యూఎస్–ఎస్‌బీ డీజీఎం చంద్రు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని డీజీఎం హామీ ఇచ్చారు. అని ఈ సందర్భంగా అన్నారు



## జలసిరి కార్యక్రమంపై రైతులు, మహిళా సంఘాలకు అవగాహన

**చేవెళ్ల, జూలై 30 (జనంసాక్షి)** నాంచేరి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ పి. అశోక్ ఆధ్వర్యంలో జలసిరి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్స్, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, ఊట కుంటల ఏర్పాటు వంటి అంశాలపై రైతులు, మహిళా సంఘాల సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పి. అశోక్ మాట్లాడుతూ.. ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వృథాగా ప్రవహించే వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించవచ్చని తెలిపారు. ప్రతి రైతు, ప్రతి గ్రామస్థుడు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సునీతా రెడ్డి, వ్యవసాయ అధికారి గాయత్రి, ప్రతేక అధికారి శంకర్‌లాల్, ఈవో రాజశేఖర్, ఉపసర్పంచ్ పూర్ణచందర్, వార్డు సభ్యులు, సీసీ మనయ్య, కారోబార్ జంగయ్య, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సంచార పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**చేవెళ్ల, జూలై 30 (జనంసాక్షి)** రాష్ట్ర ప్రభుత్వం పశుపోషక రైతుల కోసం అందుబాటులో ఉంచిన 1962 సంచార పశువైద్య సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ షాహిద్, జిల్లా అధికారి శ్రీహరి సూచించారు. గురువారం చేవెళ్లలోని 1962 సంచార పశువైద్య వాహనాన్ని సందర్శించిన అధికారులు సేవల నిర్వహణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులకు అనారోగ్యం, ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు రైతులు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే సంచార పశువైద్య బృందం నేరుగా రైతు గడపకు చేరుకుని ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ సేవల ద్వారా పశువులకు సకాలంలో చికిత్స అందడంతో పాటు పశుసంపదను సంరక్షించుకోవడానికి రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత సంచార పశువైద్య సేవలను ప్రతి రైతు వినియోగించుకుని పశుసంపదను కాపాడుకోవాలని అధికారులు తెలిపారు.

## నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి



**మల్కాజిగిరి జులై 30(జనంసాక్షి) :** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జయగిరి న్యూ వెంకటేశ్వర నగర్, జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ తదితర ప్రాంతాలలో మౌలికవసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ గురువారం జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ మరియు యు వెంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాలలో అంతర్గత రోడ్లు బాక్స్ డ్రైవ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీవాసులు బాలయ్య,రమేష్ కుమార్ పాల్,లడ్డు జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ కాలనీవాసులు,నాయకులు మల్లేష్ రాజా భాను తదితరులు ఉన్నారు.

## గర్భిణీలకు అండగా కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్

### బషీర్ మియా తాండ, ఎల్మకన్య గ్రామాల్లో ఇంటింటికీ 'శ్రీమంతం కానుక' పంపిణీ



**యాలాల జులై 30 ( జనంసాక్షి ) :** మానవతా సేవే మహోన్నత ధ్యేయంగా ప్రముఖ సామాజిక సేవకురాలు కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాలాల మండలంలోని బషీర్ మియా తాండ తాండూర్ మండలం ఎల్మకన్య గ్రామాల్లో గర్భిణీ మహిళలకు ఇంటింటికీ వెళ్లి శ్రీమంతం కానుక' పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అవసరమైన వస్తువులతో కూడిన కానుకలను అందజేసి, తల్లి , బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని కంజర్ల విజయలక్ష్మి యాదవ్ పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, స్థానిక ప్రజలు కంజర్ల విజయలక్ష్మి యాదవ్‌కు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు .గ్రామాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమలో యువకులు తదితరులు పాల్గొన్నారు.